క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామమందిరం వీధి, పురుషోత్తంవారి వీధి, వ్యాకరణంవారి వీధి, ముదిగొండవారి వీధి, శివాలయంవీధి, శివరావువీధి, గడియారంవారి వీధి, జల్లావారి వీధి, ఎస్ఆర్‌పి రోడ్డు, తాడింకివారి వీధి, అబ్బూరువారి వీధి, చల్లపల్లివారి వీధి, బ్రహ్మయ్యపంతులు రోడ్డు, కావూరువారి వీధి, రాణాప్రతాప్ వీధి, గిరి వీధి, కొమ్ముువారి వీధి, సత్యనారాయణపురం ఏరియా, ఖుద్దూస్ నగర్, మ్యాంగో మార్కెట్, ఎర్రకట్ట ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

19న నీటి సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం పరిధిలోని డాక్టర్ కెఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే తాగునీటికి ఈ నెల 19వ తేదీ సాయంత్రం అంతరాయం కలగనుంది. ఈ మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హెడ్ వాటర్ వర్క్స్‌లోని 8 ఎంజీడీ, 5 ఎంజీడీ (కొత్త ప్లాంట్)కు సంబంధించిన 900 ఎమ్ఎమ్ డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌తో పాటు కొత్తగా వేసిన 500 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ (40వ డివిజన్ పరిధిలోని లారీ స్టాండ్‌లో కొత్తగా నిర్మించిన రిజర్వాయర్ ఇన్‌లెట్)కు ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నారు. జీవీఆర్ నగర్, వాంబేకాలనీ, ఉడాకాలనీ, కండ్రిక విలేజ్, ఆంధ్రప్రభ కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేట, అజిత్‌సింగ్‌నగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతినగర్, ఎన్ఎస్‌సీ బోస్ నగర్, ఫ్రైజర్ పేట, టన్నెల్ బూస్టర్ ప్రాంతాల్లో 19న సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. కాగా డైరెక్ట్ వాటర్ సప్లై అయ్యే కేదారేశ్వరపేట, పాత రాజరాజేశ్వరి పేట, వాంబే కాలనీ, శాంతినగర్, సింగ్‌నగర్, కెఎల్‌రావునగర్, మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతాల్లోకూడా ఆ రోజు తాగునీటి సరఫరా ఉండదు. తిరిగి 20వ తేదీ మంగళవారం ఉదయం నుంచి యధావిధిగా నీటిసరఫరా జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రేపు అక్కినేని శత జయంతి వేడుకలు



విజయవాడ కల్చరల్: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సినీ నటుడు, నిర్మాత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు చెందిన అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచం గర్వించేలా స్టూడియో నిర్మాణం చేశారని తెలిపారు. అక్కినేని జీవితం గురించి నేటి తరానికి తెలియజేయడానికి పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి పాల్గొంటారని చెప్పారు. సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్‌కు అక్కినేని జాతీయ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నామని దేశ విదేశాల్లో ఉన్న అక్కినేని అభిమానులు హాజరు అవుతారని తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఆలపిస్తారని వెల్లడించారు. అనంతరం అక్కినేని శత జయంతి వేడుకలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కే డేవిడ్‌రాజు, భేతాళం వీరభద్రరావు, అరిగెల శివరాంప్రసాద్, జేకే చక్రవర్తి, గాయకుడు ప్రిన్స్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు



ఒకటవ డివిజన్‌లో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గుణదల(విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఒకటవ డివిజన్ పరిధిలోని గుణదల గాంధీజీకాలనీలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని అన్నారు. అమ్మఒడి, రైతుభరోసా, వాహనమిత్ర, విద్యాదీవెన వంటి పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. టీడీపీ హయాంలో ప్రజల పరిస్థితి దయనీయంగా ఉండేదని గుర్తు చేశారు. మరలా ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అల్లకల్లోలంగా మారుతుందని ఎద్దేశా చేశారు. టీడీపీ నేతలు ధనదాహానికి నిదర్శనంగా కాల్ మనీ, సెక్స్ రాకెట్ల భాగోతం జరిగిన సంఘటనలను గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని కోరారు.

సెంట్రల్‌లో విజయ ఢంకా మోగిస్తాం..

రానున్న ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జయకేతనం ఎగురవేస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పొత్తు రాజకీయాలు ఇక్కడ భూస్థాపితం అవుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు పరిచిన సంక్షేమ పథకాలే తిరిగి తమ పార్టీని అధికారంలోకి తెస్తాయని పేర్కొన్నారు. ప్రజా క్షేత్రంలో సీఎం జగన్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజా సమస్యలను విస్మరించి స్వార్థ రాజకీయాలతో ప్రజలను పీడించే టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో పరాజయం తప్పదని తేల్చి చెప్పారు. ముఖ్యంగా బోండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గుణదల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. గాంధీజీకాలనీలో స్థానిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. తాగునీరు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీత, డివిజన్ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, సురేష్, వేణు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..



31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐదు డివిజన్ వాసుల కోసం నిర్మిస్తున్న ఆర్‌యూబీని నెల రోజుల్లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని వెలంపల్లి హామీ ఇచ్చారు. అలాగే డివిజన్‌లో దోమల నివారణ చర్యలు వేగవంతం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై ఏ వేదికపైన అయినా తాను బహిరంగ చర్చకు సిద్ధమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సవాలు విసిరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా చంద్రబాబు డైరెక్షన్‌లో పచ్చ పత్రికలు వండివారుస్తున్న విషపు రాతలనే తిరిగి విధ్వంసం పుస్తకం రూపంలో పొందుపరిచారని ఆరోపించారు. కేవలం ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కాలకూట విషాన్ని చిమ్మేందుకే రచయిత ఆలపాటి సురేష్‌కుమార్ ఈ పుస్తకాన్ని రాశారని మండిపడ్డారు. పేద ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా మనసులో మాట పేరుతో ఏకంగా ఒక పుస్తకమే ముద్రించిన చంద్రబాబుకి.. తమ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. 'బాబు జమానా అవినీతి ఖజానా' అని 2003లో పుస్తకం వేసిన కమ్యూనిస్టులు నేడు బాబు అడుగులకు మడుగులొత్తడం బాధాకరమని పేర్కొన్నారు.

నిలకడ లేని వ్యక్తి పవన్‌కల్యాణ్..

డబుల్ స్టాండ్ పవన్‌కల్యాణ్‌కు కొత్తేమీ కాదని.. అతను నిలకడ లేని వ్యక్తి అని మల్లాది విష్ణు వ్యాఖ్యానించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్ష నేతలుగా ఉండటం ఈ రాష్ట్ర దౌర్భాగ్యమని.. అధికారంలో ఉన్నంత కాలం పేదలకు భవిష్యత్తు లేకుండా చేశారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుల శవ రాజకీయాలు సిగ్గుచేటు

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం



ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లకు నిప్పు పెడుతున్న శేషు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కైకాల చరణ్ మరణంపై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు చేయడం, తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. శేషు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం కోసం పరితపించే మంచి యువ నాయకుడు కైకాల చరణ్ అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఎన్నికల్లో ఎలా అయినా లబ్ధి పొందాలనే దుర్మార్గపు ఆలోచనలతో బొండా ఉమా ఈ మరణాన్ని కూడా తన నీచ రాజకీయాల కోసం వాడుకోవాలని చూడడం హేయమని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ విజయం కోసం పనిచేసే చరణ్‌ను వెలంపల్లి ఎందుకు వేధింపులకు గురిచేస్తాడని ప్రశ్నించారు. మానవత్వం మంటకలిసే విధంగా బొండా ఉమా వ్యవహరించడం దారుణమన్నారు. వెలంపల్లి ఒత్తిళ్లతోనే కైకాల చరణ్ చనిపోయారంటూ టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం, వాటిని తోక పత్రికలైన ఆంధ్రజ్యోతి, ఈనాడులో ప్రచురించడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. ఈనాడు ఆంధ్రజ్యోతి విషపు రాతలను కాపు నేతలంతా ఖండిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ వెనకాల తిరుగుతున్నాడని టీడీపీ నాయకులే చరణ్‌ను బెదిరించి ఉంటారని మాకు కూడా అనుమానంగా ఉందన్నారు. కాపుల వ్యతిరేక పార్టీ తెలుగుదేశం అని, వంగవీటి మోహన్ రంగాను చంపిన దగ్గర నుంచి కాపులంతా ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పచ్చ మీడియా నీచ రాతలపై న్యాయ పోరాటం చేస్తాం అని, చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం అని తెలిపారు. కాపు సంఘం నాయకులు చింతా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను చూస్తుంటే బొండా ఉమాకు వణుకుపుడుతుందని పేర్కొన్నారు. ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చరణ్ భౌతికకాయాన్ని దర్శించకుండా, కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించని బొండా ఉమా, టీడీపీ నాయకులు అతని మరణంపై అసత్య ఆరోపణలు చేసి, వారి కుటుంబ పరువును రోడ్డుకు ఈడ్చడం దారుణమన్నారు. బొండా ఉమా, టీడీపీ నాయకులు ఇలానే శవరాజకీయాలు చేయాలని చూస్తే తగిన గుణపాఠం గట్టిగా చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను తగలబెట్టారు. కాపు సంఘం నాయకులు కమ్మిలి రత్నాకర్, దుర్గ గుడి మాజీ ధర్మకర్త కనుగుల బాల, మాత మహేష్, చింతలపూడి రమేష్, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

నా కుమారుడి మరణం రాజకీయం చేయొద్దు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుండెపోటుతో చెట్టంత కొడుకును కోల్పోయి బాధలో ఉన్న మాకు.. తమ కొడుకు మృతిని టీడీపీ నేతలు రాజకీయం చేయడం తగదని కైకాల చరణ్ తల్లి కైకాల అంజలీదేవి కన్నీటి పర్యంతం అయ్యారు. తన కొడుకు మృతిని టీడీపీ నేతలు రాజకీయం చేయడం పట్ల శుక్రవారం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట్నుంచి వైఎస్సార్ సీపీ కోసం తన కుమారుడు పని చేస్తున్నారని గుర్తు చేశారు. తమ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు అండగా ఉన్నారని టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా చరణ్ మృతిపై పుకార్లు సృష్టించవద్దని ఆమె వాపోయారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాబోయే సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, కేఆర్సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి హాజరయ్యారు. పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఈవీఎంలను భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూములు, లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లు, అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన డ్రాయింగ్ ఆఫీసర్లు ఆయా శాఖలకు చెందిన ఉద్యోగస్తుల వివరాలను ఎంప్లాయిస్ డేటా వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంకనూ అప్‌లోడ్ ప్రక్రియ పూర్తిచేయని అధికారులు శనివారం లోగా వివరాలను నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎన్నికల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సంక్షేమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి



విజయవాడ కల్చరల్: ప్రభుత్వం నిర్వహించే ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు సూచించారు. శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద ఆయన 353వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీరు, తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు శీలం నాగేశ్వరరావు, విద్యావేత్త బీ అరుణ్ పాల్గొన్నారు. అలాగే సాయంత్రం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో కూచిపూడి నృత్యోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భాగవతుల వెంకట్రామశర్మ బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. కవి పండిత సత్కార కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డీ దత్తాత్రేయశర్మ, జేవీ చలపతిరావు, డాక్టర్ కే బాలకృష్ణ, డాక్టర్ యశోద పూర్ణచంద్రరావు, నృత్య కళాకారులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు సత్కరించారు.

సిబ్బందికి విధులు కేటాయింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం పునఃప్రారంభం కావడంతో ఆదివారం నుంచి సిబ్బందికి విధులను కేటాయిస్తూ ఆలయ ఈవో కేఎస్ రామారావు ఆదేశాలు జారీ చేశారు. ద్వారకా తిరుమల నుంచి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ టి. అనురాధను మల్లేశ్వరాలయం వద్ద దర్శన టికెట్లు, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో మొదటి షిప్టు విధులు కేటాయించారు. అటెండర్ ఎం.మనోహర్‌ను దర్శనం, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో రెండో షిఫ్టు విధులు అప్పగించారు. ఇక ప్రసాదం కౌంటర్లలో మొదటి షిఫ్టుకు అవుట్ సోర్సింగ్‌కు చెందిన ఎస్. ప్రసాద్‌కు మొదటి షిఫ్టు, ఎం. గీతకు రెండో షిఫ్టు విధులు ఇచ్చారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి.చిన్నమ్ములును మల్లేశ్వరాలయంలో క్యూలైన్ల పర్యవేక్షణ మొదటి షిఫ్టు, టి. నాగమణికి రెండో షిఫ్టు విధులు కేటాయించారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి. శేషాచలంను పవిత్ర సారె కౌంటర్‌కు, కుంకుమ ప్రసాదం ప్యాకింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టి. లక్ష్మీని పొంగలి షెడ్డుకు బదిలీ చేశారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర ఆలయంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రథసప్తమి పురస్కరించుకుని నగరంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సూర్య నమస్కారాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సూర్యభగవానుడి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్వామివారికి పాయసం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు జరిగాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాయసం తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డీ శివరామరాజు పర్యవేక్షించారు. అలాగే ముత్యాలంపాడులోని శ్రీ పట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో రథసప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆదిత్య హృదమ పారాయణం జరిగింది. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించిన రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా సామూహిక సూర్యవ్రతం



మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కల్యాణార్థం శ్రీశివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి ఆధ్వర్యాన శుక్రవారం అజిత్‌సింగ్ నగర్ గుజ్జల సరళదేవి కల్యాణ మండపంలో సామూహిక శ్రీసూర్యవ్రతం జరిగింది. ఈ సందర్భంగా శ్రీశివజ్ఞాన పీఠాధిపతి శ్రీశివాచార్య స్వామి సూర్యగ్రహ హోమం, సూర్యవ్రతం శాస్త్రోక్తంగా చేయించారు. అలాగే శ్రీసూర్యవ్రతం, రథసప్తమి విష్టతను వివరించారు. ఈ నెల 26వ తేదీన మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం సమీపంలోని బచ్చు కోటయ్య వసతి గృహంలో చంద్రగ్రహ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్యభగవానుడి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సూర్యవ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు ఆకాంక్షించారు. లోక కల్యాణార్థం ఏర్పాటు చేసిన శ్రీసూర్యవ్రతంలో వారు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఛాంబర్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేయడం వల్ల ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. ఏప్రిల్-27న జరుగనున్న పాలీసెట్-2024 ప్రవేశ పరీక్షపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో జరిగింది. నగరంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు వెళ్లి పాలిటెక్నిక్ కోర్సులపై, కోర్సు పూర్తి చేసిన అనంతరం ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు.

గడప గడపకు నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం



282వ సచివాలయం పరిధిలో బీటీ రోడ్డు



కండ్రికలో రోడ్డు నిర్మాణ పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 19.95 లక్షలతో 64వ డివిజన్ మసీదు నుంచి లగడపాటి కల్యాణ మండపం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును గడప గడపకు మన ప్రభుత్వం పర్యటనలో 282వ వార్డు సచివాలయం పరిధిలోని స్థానికులు మసీదు రోడ్డు నుంచి లగడపాటి కల్యాణ మండపం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గానూ రూ. 19.95 లక్షలతో ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. 220 మీటర్ల పొడవుగల బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు ఆ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఆరు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నామని రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.

కండ్రికలో రోడ్డు నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సమస్యలపై తక్షణమే స్పందిస్తున్నారు. ఇటీవల 64వ డివిజన్‌లో పర్యటించిన వెలంపల్లికి కండ్రిక ప్రజానీకం రోడ్డు నిర్మించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెలంపల్లి రోడ్డును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో అధికారులు గత రెండు రోజులుగా కండ్రికలో వెట్ మిక్సింగ్ రోడ్డు పనులు చేస్తున్నారు. కండ్రిక కట్ట నుంచి శివాలయం మీదుగా నూజివీడు రోడ్డుకు అనుసంధానం చేస్తున్నారు. 60 మీటర్ల పొడవుతో రూ. 4.95 లక్షల వీఎంసీ జనరల్ ఫండ్స్‌తో బీటీ అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్నట్టు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు కే నవీన్ తెలిపారు.